



పుట్టపర్తిలో పి-4 సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్

సమర్ధవంతంగా పి-4 సర్వే

28లోపు పీపుల్ సర్వే పూర్తి కావాలి
ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని పి-4 సర్వేను జిల్లాలో సమర్ధవంతంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పి-4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్నర్ షిప్) సర్వేపై మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేట్, ప్రజల భాగస్వామ్యంతో ప్రతి ఇల్లు పేదరికాన్ని అధిగమించి ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పి-4 పాలసీని అమలు చేస్తోందన్నారు. ఈ సర్వే ద్వారా దారిద్ర్యరేఖకు దిగువనున్న వారిని గుర్తించాల్సి ఉంటుందన్నారు. ఈనెల 28 వరకు సర్వే చేపట్టి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేయాలని ఆదేశించారు.

ఇంటర్ పరీక్షలకు లోటుపాట్లు రానీయొద్దు

మార్చి 1వ తేదీ నుంచి జిల్లాలో జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్నీ పూర్తి చేయాలన్నారు. 42 కేంద్రాల్లో పరీక్షలకు 23,987 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. ఇందులో మొదటి సంవత్సరం 13083 మంది, ద్వితీయ సంవత్సరం 10904 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు ఎలా ఉన్నాయన్న దానిపై అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ విజయ సారధి, ఆర్డీవోలు సువర్ణ, శర్మ, మహేష్, ఆనంద్, ఉమ్మడి జిల్లాల డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బయ్య, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, గ్రామ వార్డు సచివాలయం నోడల్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి, సిపిఒ విజయ్ కుమార్, డిపిఒ సమత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పి-4 సర్వే పరిశీలన

పుట్టపర్తి మున్సిపాలిటీ 19వ వార్డు వై.జంక్షన్ ప్రశాంతి గ్రామంలో పి-4 సర్వేను కలెక్టర్ టిఎస్.చేతన్ శుక్రవారం ఉదయం పరిశీలించారు. అక్కడ ఓ కుటుంబం పూర్తి వివరాలను సర్వేలో సిబ్బంది చేత నమోదు చేయించారు. వివరాలన్నింటినీ పూర్తి స్థాయిలో నమోదు చేయాలని కలెక్టర్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద, సిపిఒ విజయ్ కుమార్, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

దశాబ్దంలో ఏడేళ్లు కరువే..!



- చేతికందని పంటలు.. గిట్టుబాటు కాని ధరలు
- కానరాని శాశ్వత నివారణ చర్యలు
- కరువు మండలాల ప్రకటనలతోనే సరి
- అన్నదాతకు అన్ని విధాలా నష్టం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కొత్త జిల్లా ప్రకారం అనంతపురం జిల్లాలో మొత్తం 31 మండలాలు ఉన్నాయి. అన్ని మండలాల్లో ఏటా కరువు పరిస్థితులే నెలకొన్నాయి. అంతకు మునుపు ఏడాది మాత్రం 28 మండలాల్లో కరువును ప్రభుత్వం నిర్ణయించింది. గతేడాది ఏడు మండలాలు, ఈ ఏడాది నాలుగు మండలాలు కరువు మండలాలు ఉన్నాయి. ఇలా నిత్యం వర్షాభావంతో అన్నదాతలు నష్టాల ఊబిలో కూరుకుపోయారు.

పదేళ్లలో ఏడేళ్లు కరువు

పది సంవత్సరాలు అంటే 2013-14 సంవత్సరంలో 31 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది. 2014-15 సంవత్సరంలో 31 మండలాలు, 2015-16లోనూ 31 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారు. 2015-16, 2016-17, 2017-18, 2018-19, తాజాగా 2023-24 ఏడు సంవత్సరాలు



కరువు నెలకొన్నాయి. మధ్యలో 2019-20, 2020-21, 2021-22 సంవత్సరాల్లో మాత్రమే వర్షాలు ఒక మోస్తరు పడటంతో కరువు జిల్లాలో నెలకొనలేదు.

కరువు నివారణ చర్యలు నామమాత్రమే..

తీవ్రమైన దుర్భిక్ష ప్రాంతమైన అనంతపురం జిల్లాలో పాలకులు కరువు నివారణ చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలూ ఉన్నాయి. జిల్లాకు సాగునీటిని అందించే ప్రధాన ప్రాజెక్టులు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, హంద్రీనీవా రెండింటి పరిస్థితి దయనీయంగానే



మారింది. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ మరమ్మతులకు కూడా నోచుకో కపోవడంతో నీటిని జిల్లాకు తీసుకురావడంలో అనేక అవాంతరాలు ఏర్పడు తూనే ఉన్నాయి. ఆధునీకరణ పనులను వైసిపి ప్రభుత్వం వచ్చాక రద్దు చేసింది. మరో ఐదేళ్లు ఈ పనులు చేపట్టేందుకు వీల్లేదన్న షరతు కూడా పెట్టింది. దీంత ఆధ్వాన్నంగా ఈ కాలువలో పూర్తి సామర్థ్యంతో నీటిని తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. హంద్రీనీవాను ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతున్నట్టు వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రకటించింది. ఈ మేరకు టెండర్లు ఆహ్వానించారు. కాని పనులు ప్రారంభమవలేదు. దీంతో ఈ కాలువలోనూ అరకొర నీటితోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఇప్పుడు ఈ ప్రభుత్వం హంద్రీనీవా కాలువ వెడల్పు పక్కన పెట్టింది. రెండవ దశ లైనింగ్ పై మాత్రమే శ్రద్ధ పెట్టింది.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

'మంత్రిపై అసత్య ప్రచారాలను సహించం' : టిడిపి

ప్రజాశక్తి-పెనుకొండ

మంత్రి సవితపై అసత్య ప్రచారం చేస్తే సహించేది లేదని టిడిపి నాయకులు హెచ్చరించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శెట్టిపల్లి గ్రామంలో వైసిపి నాయకుడు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు కృష్ణారెడ్డి నకిలీ పత్రాలు సృష్టించి భూమిని కబ్జా చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. భూమి వారసుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి బాధితులకు న్యాయం చేయగా, ఇది చూసి ఓర్వలేని కొందరు మంత్రిపై అవాకులు చవాకులు పేలడం తగదని హితవు పలికారు. దిగజారుడు రాజకీయాలు చేయడం వైసిపి నాయకులకే చెల్లుతుంద న్నారు. నకిలీ పత్రాలతో రిజిస్టర్ చేసుకున్న కృష్ణారెడ్డి, అతని కుటుంబ సభ్యులపై కేసులు పెడతామన్నారు. పోలీసులు విచారణ చేసి ఇలాంటి నకిలీగాళ్లను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇకపై మంత్రిపై దుష్ప్రచారాలు చేస్తే ఖబర్దార్ అంటూ వైసిపి శ్రేణులకు హెచ్చరికలు జారీ చేశారు. సమావేశంలో టిడిపి నాయ కులు మునిమడుగు వెంకటరాముడు, పట్టణ అధ్యక్షులు శ్రీరాములు, రూరల్ కన్వీనర్ సిద్దయ్య, గోనిపేట సర్పంచి నాగరాజు, నారాయణనాయక్ పాల్గొన్నారు.

యానిమేటర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-గోరంట్ల

స్థానిక అల్లా మాలిక్ గ్రామైక్య సంఘంలో విఎఒ యానిమేటర్‌గా పని చేస్తున్న చాకలి వరలక్ష్మిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీసీలు చంద్రశేఖర్, సుధాకర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ యానిమేటర్ విఎఒను వేతనం కోసం ఆఫీస్‌కు రమ్మని చెప్పి ఉదయం నుంచి సాయంత్రం వరకూ బయటపెట్టి అవమానించడంతో పాటు వేతనం ఇచ్చేది లేదని సీసీలు, మండల సమాఖ్య అధ్యక్షురాలు నాగమణి దూషించడం తగదన్నారు ఈ విషయంపై అధికారులు స్పందించి వెంటనే సీసీలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు యానిమేటర్‌కు న్యాయం జరగకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కమల్‌బాషా, యానిమేటర్స్ యూనియన్ జిల్లా కో కన్వీనర్ వెంకట్, రాములు, మాధవి, మహేష్ పాల్గొన్నారు

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా..!

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని అడవుల్లో కలప వ్యాపారులు పచ్చని చెట్లను నరికి రాత్రికి రాత్రే యథేచ్ఛగా వారి స్థావరాలకు తరలిస్తున్నా అడిగేవారే కరువయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు కలప వ్యాపా రులు ఎటువంటి అనుమతి లేకుండా అడవుల్లో పెద్దపెద్ద చెట్లను నరికి, రాత్రి వేళ అక్రమంగా తరలిస్తు న్నారు. అయినా అటవీ శాఖ అధికారులు అరికట్టే చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. రైతులు అవసరం నిమిత్తం చిన్న చెట్టును నరికితే నానా హంగామా చేసే అటవీ శాఖ అధికారులు పెద్ద మొత్తంలో పచ్చని చెట్లను నరికి రాత్రివేళ అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుం టున్న వారి పట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే శుక్రవారం తెల్లవారు జామున ట్రాక్టర్‌లో అక్రమంగా కలపను తరలిస్తుండగా చూసిన ప్రజలు అటవీ శాఖ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఇకనైనా అటవీ శాఖ అధికారులు స్పందించి అడవిలోనైనా, మరెక్కడైనా పచ్చని చెట్లను నరికి వేయకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



రాత్రివేళ అక్రమంగా కలప తరలిస్తున్న వ్యాపారులు

రైతుల సమక్షంలోనే రీసర్వే జరగాలి

కలెక్టర్ టిఎస్.చేతన్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రైతుల సమక్షంలోనే రీ సర్వే జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో రీ సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సంబంధిత ఆర్డీవోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అందరు ఆర్డీవోలు వారి డివిజన్ పరిధిలో రీసర్వేపై ప్రత్యేక సమావేశం నిర్వహించుకోవాలన్నారు. సర్వే సమయంలో సంబంధిత రైతుతోపాటు, చుట్టుపక్కల రైతులనూ సర్వే ప్రాంతానికి పిలవాలని సూచించారు. వెబ్ ల్యాండ్ రికార్డుల ప్రకారం రీ సర్వే ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. రీ సర్వే జరుగుతున్న తీరుపై క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలని సర్వే ఏడీని ఆదేశించారు.

ప్రజాపంపిణీ వ్యవస్థను బాధ్యతగా తీసుకోవాలి

జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థను సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్లు బాధ్యతగా తీసుకుని ప్రజలకు రేషన్ సరుకులు సక్రమంగా అందేలా చూడాలని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ప్రజా పంపిణీ వ్యవస్థపై జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ రేషన్ సక్రంగా అందించాలన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. తూకాల్లో మోసం చేస్తే సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్ పంపిణీలో జిల్లా దిగువ స్థాయిలో ఉందని దీనిని అగ్రభాగంలోకి తీసుకెళ్లేలా కృషి చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ అధికారి వంశీ కృష్ణారెడ్డి, మేనేజర్ అశ్వర్థ నాయక్, ఆర్డీవోలు, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహశీల్దార్లు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల పోస్టర్ ఆవిష్కరణ




ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) 6వ జిల్లా మహాసభల ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు ఈఎస్.వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వీరేశ్, జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున పిలుపునిచ్చారు. ఆ మేరకు శుక్రవారం పట్టణంలోని సిఐటియు కార్యాల యంలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈఎస్.వెంకటేష్ మాట్లాడు తూ పెనుకొండ పట్టణంలో ఎస్ఎఫ్ఐ 6వ జిల్లా మహాసభలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా ఈ నెల 24వ తేదీ భారీ ర్యాలీ, బహిరంగ సభ ఉంటాయన్నారు. బహిరంగ సభకు మాజీ ఎమ్మెల్సీ డా.గేయానంద్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న హాజరవుతారన్నారు. మహాసభల్లో ప్రస్తుతం విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు, విద్యా విధానాలు, భవిష్యత్ కార్యక్రమాలపై చర్చిస్తారని తెలిపారు. మహాసభలు, ర్యాలీ, బహిరంగ సభకు విద్యార్థులు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి, హర్షకుమార్, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

2న ప్రభుత్వ ఉద్యోగుల కౌన్సిల్ మహాసభ



మహాసభ కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ

ఎపి ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ ప్రథమ కౌన్సిల్ మహాసభను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు కెఆర్.సూర్యనారా యణ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో శు క్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 2వ తేదీ ధర్మవరం పట్టణంలో నిర్వహిస్తున్న కౌన్సిల్ మహాసభకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలన్నారు. జిపిఎస్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేం దుకు ఈ మహాసభ తోడ్పడుతుందన్నారు. అన్ని ఉద్యోగ సంఘాలు ఈ మహాసభకు మద్దతు తెలపాలని కోరారు. మహాసభలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు. అనంతరం మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో ఎపిసిపిఎస్ఇఎ వ్యవస్థాపక అధ్యక్షులు, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు యాదవ్, జిల్లా గౌరవాధ్యక్షుడు ప్రభా కర్, నాయకులు హరి, మల్లికార్జున, నీలం అశోక్, రామ్‌ప్రసాద్, రంగేష్ కుమార్, రామాంజనేయులు, బాలు, సజ్జరాయప్ప, గోకుల్, చంద్రశేఖర్, వెంకటేష్, రుద్రేష్, హరి, పిజి.రఘునాథ్, రాధారమణ, నాగభూషణం, సుభాష్‌నాయక్, ఓబులేసు, సిపిఎస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసిపి మడకశిర పట్టణ కన్వీనర్ రాజీనామా

ప్రజాశక్తి-మడకశిర



పుట్ట కామప్ప

వైసిపికి రాజీనామా చేసినట్లు ఆ పార్టీ మడకశిర పట్టణ కన్వీనర్ పుట్ట కామప్ప శు క్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత కారణాలతో వైసిపి సభ్యత్వానికి రాజీనామా చేశానని, ఏ పార్టీలో చేరేది శనివారం ప్రకటిస్తా నని తెలిపారు. వైసిపిలో ఉండలేక ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని బాలాజీ నగర్‌లో ఉన్న టిడిపి కార్యాలయం శు క్రవారం మండలంలోని మనూరు పంచాయతీకి చెందిన వైసిపి నాయకులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. లక్ష్మీనారాయణప్ప, నరసప్ప, ముత్తన్న, నరసింహమూర్తి, చంద్రశేఖర్‌తో పాటు 10 కుటుంబాలు వైసిపికి రాజీనామా చేసి పసుపు కండువా కప్పుకొన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, నాయకులు లక్ష్మీపతి, లక్ష్మీనరసప్ప, ఆనందస్వామి, అనిల్, నరసింహమూర్తి, శివలింగేగౌడ్, దాలప్ప, డీలర్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి-లేపాక్షి

వైద్య పరీక్షల కోసం ప్రతి శుక్రవారం స్థానిక పిహెచ్‌సికి వచ్చే గర్భిణులకు తన తల్లి పేరున భోజనం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందని లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ కరణం రమానందన్ తెలిపారు. ప్రతి వారం లాగే స్థానిక పిహెచ్‌సిలో వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు శుక్రవారం రమామణి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధినేత, సమాజ సేవకులు, లేపాక్షి ఆలయ కమిటీ ఛైర్మన్ కరణం రమానందన్ 60 మంది మహిళలకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్లు, వైద్య సిబ్బంది, గర్భిణులు, ఛైర్మన్ రమానందన్ మిత్రమండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : మండలంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స కోసం వచ్చిన గర్భిణులకు ఎస్ఆర్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ప్రతి నెలా చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో టిడిపి మండల నాయకులు అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి డాక్టర్ సోమశేఖర్, టిడిపి మండల నాయకులు క్రిష్టప్ప, హరీష్, లింగప్ప, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

3న రైతు సదస్సు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మార్చి 3వ తేదీ హిందూపురం పట్టణంలో నిర్వహించే రైతు సదస్సులో రైతులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘ జిల్లా నాయకులు రంగనాయకులు పిలుపునిచ్చారున. మండలంలోని కేతగానిచెరువు గ్రామంలో శుక్రవారం అఖిల భారత రైతు, వ్యవసాయ కూలీల సంఘం ఆధ్వర్యంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. రంగనాయకులు మాట్లాడుతూ పండించే పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల రైతులు అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, హంద్రీనీవా ప్రాజెక్ట్‌కు 40 టీఎంసీల నీళ్ల కేటాయించి ఏటా జిల్లాలోని అన్ని చెరువులకు నీరు అందించాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, పాలకు లీటర్‌పై అదనంగా రూ. 5 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతుసదస్సు గోడ పత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో కేతగానిచెరువు గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని దేవరహట్టి, గుడిబండ రైతు సేవా కేంద్రాలను శుక్రవారం వ్యవసాయ అధికారి వీర నరేష్ సందర్శించి రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతు సంబంధిత రైతు సేవా కేంద్రానికి వెళ్లి తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకుని ఐడి పొందాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం బయట వ్యక్తులను ఆశ్రయించవద్దన్నారు. ఏవో వెంట రైతు సేవా కేంద్రం ఉద్యోగులు రాధిక, రమేష్, రైతులు ఉన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి-గోరంట్ల



బ్యాంకు ముందు నిరసన తెలుపుతున్న సిబ్బంది

కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని బ్యాంకు సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు పనివేళలు ముగిసిన తర్వాత శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ఎస్‌బిఐ శాఖ వద్ద బ్యాంకు సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి, కొత్తగా రిక్రూట్మెంట్ చేయాలి, వారంలో ఐదు రోజులు మాత్రమే పని దినాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగేశ్వరరెడ్డి, మహేంద్ర, జిలాన్‌బాషా, యుగంధర్‌రెడ్డి, రిషికేష్, మహేష్, సాయికిరణ్, మారుతి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు

చంద్రమౌళేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాట్లు

ప్రజాశక్తి-మడకశిర

మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలోని పావగడ రోడ్డులో వెలసిన శివాలయం వద్ద భక్తులు జాగరణ చేసేందుకు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరిం గ్ ఉద్యోగులు, స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్ గుండుమల జయప్ప, మున్సిపల్ కమిషనర్ కొత్తగా తారు రోడ్డు, డివైడర్ల మధ్యలో కంప చెట్ల తొలగింపు, రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపాల అలంకరణ, తదితర పనులను శుక్రవారం పరిశీలించారు. వారి వెంట కౌన్సిలర్ ఉమాశంకర్, నాగరాజు, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు తిమ్మరాజు ఉన్నారు.


రైతుల సమస్యలపై నిరసనలు

మడకశిర : ఉమ్మడి అనంతపురం జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24, మార్చి 3 తేదీల్లో సచివాలయాలు, రెవెన్యూ కార్యాలయాల వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమాల్లో రైతులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని బుల్లసముద్రంలో శుక్రవారం వారు మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర, బీమా, హంద్రీనీవా కాలువల వెడల్పు, చెరువులకు సాగునీరు, తదితర సమస్యలపై నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు కె.సోమ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, రైతులు రంగనాథప్ప పాల్గొన్నారు.

'ఉపాధి' పనులను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-గుడిబండ

ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎపిడి లక్ష్మీనారాయణ సూచిం చారు. మండలంలోని కరికెర, కెఎన్.పల్లి, దాసరపల్లి, తదితర గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులను శుక్రవారం ఎపిడి పరిశీలించారు. 'రోజ్‌గార్ దివస్' కార్యక్రమంలో భాగంగా కూలీలకు ఉపాధి హామీ చట్టంపై అవగాహన కల్పించారు. ఎపిడి మాట్లాడుతూ కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరుతో కూలీలు ఉన్నచోటే అవసరమైన పనులు కల్పిస్తుందన్నారు. కూలీలకు ఈ పథకం వరం లాంటిదని, ప్రతి కూలీ ఈ పనులను సద్విని యోగం చేసుకోవాలని సూచిం చారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్లు తిరుమలరాజ్, లోకేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు సత్యనారాయణ, రజిని, పాండురంగప్ప, మేట్లు, ఉపాధి కూలీలు ఉన్నారు.



రోజ్‌గార్ దివస్‌పై కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఎపిడి లక్ష్మీనారాయణ

8న జాతీయ లోక్‌అదాలత్

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

మార్చి 8వ తేదీన నిర్వహించబడే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జ్, చైర్మన్ గీతావాణి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీమార్గమే రాజ మార్గమని అన్నారు. ఈ లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పు తుది తీర్పు అవుతుందని తెలిపారు. కచ్చిదారులు, పోలీసులు ,బ్యాంకు రుణం కేసులు, అందరికీ కూడా రాజీకు తగ్గ కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. అదేవిధంగా న్యాయవాదులు తమ కక్షిదారులతో చర్చించి ఈ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గువ్వలగుట్టపల్లిలో శుక్రవారం వడదెబ్బ పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమాన్ని వైద్యాధికారులు నిర్వహించారు. వడదెబ్బ గురించి ప్రజలలో అవగాహన ఉండాలన్నారు. వీలయినంత వరకు ప్రయాణాలు ,పనులు ఉదయం 10 గంటలలోపు మధ్యాహ్నం 3 గంటల తరువాత ఉండేటట్లు చూసుకోవాలని చెప్పారు. పోషక ఆహారం తీసుకొని ఆరోగ్య వంతమైన జీవనం గడపాలని కోరారు. ఈ కార్యక్రమములో సామజిక ఆరోగ్య కార్యకర్త నగేష్, సబ్ యూనిట్ అధికారి రమణయ్య, ఎంఎల్‌హెచ్‌పి సత్యమ్మ, ఆరోగ్య కార్యకర్త పుష్ప, ఆశా కార్యకర్త లక్ష్మీ నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఒంటిపూట బడులు ప్రారంభించాలి

ప్రజాశక్తి - కొత్తచెరువు

శ్రీ సత్యసాయి జిల్లాలో ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని తక్షణమే ఒంటి పుట బడులు ప్రారంభించాలని పదవ తరగతి పరీక్ష కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలని, పరీక్షల సమయంలో హాల్ టికెట్ ఉన్న ప్రతి విద్యార్థికి ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని ఎఐఎస్‌ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిఇఒకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగ ఆ సంఘం జిల్లా అధ్యక్షులు శేషం మహేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా సత్యసాయి జిల్లాలో ఫిబ్రవరి మాసం నుంచే ఎండ తీవ్రత విపరీతంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున ,మహేష్ నాయక్,బన్నీ,కిరణ్, బాను ,గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు

క్షయ నివారణ సాధ్యమే

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

అధునాతన పరికరాలతో క్షయ వ్యాధిని నివారించవచ్చునని జిల్లా క్షయ వ్యాధి మెడికల్ ఆఫీసర్ కె గాయత్రీ బాయి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు క్షయ వ్యాధి పై అవగాహన కల్పించారు. క్షయ వ్యాధి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు, మందులు వాడే విధానాన్ని వివరించారు. క్షయ వ్యాధికి మొదటి దశలోనే మందులు తీసుకుంటే తొందరగా కోలుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ వ్యాధి నివారణ విభాగం డిస్ట్రోగ్రం కోఆర్డినేటర్ మల్లికార్జున, నాగేంద్ర, ధర్మవరం అర్బన్ కమ్యూనిటీ ఆర్గనైజర్ లక్ష్మీనారాయణ, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు, టీబీ సూపర్వైజర్లు, అధ్యాపకులు మల్లికార్జున, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట భద్రత

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని చిల్లవారిపల్లి గ్రామ సమీపాన ఉన్న శ్రీ కాటి కోటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు డీఎస్పీ ఆధ్వర్యంలో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఎస్ఐ కృష్ణవేణి తెలిపారు. గతంలో జరిగిన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని డ్రోన్ల ద్వారా పర్యవేక్షణ ఉంటుందని అన్నారు. అలాగే గతంలో జరిగిన అవాంఛనీయ సంఘటనలు దృష్టిలో పెట్టుకొని 50 మంది నేరచరిత్ర ఉన్న వారిని బైండోవర్ చేశామని తెలిపారు

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డిని స్థానిక ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు ముదిగుబ్బలో శుక్రవారం సన్మానించారు. పుట్టపర్తిలోని ఓ సమావేశానికి వెళ్తూ మార్గమధ్యలో మండల కేంద్రంలోని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఖలందర్ స్వగృహాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డిని సంఘం నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు హైదర్ వలి, నిసార్ , షబ్బీర్ , ఆర్ఎంపి బాష, ఫిరోజ్ , మౌలాసాబ్ , ముస్తాక్ , ముబారక్ , బాబావలి , యాసీన్ , తాజ్ , తదితరులు పాల్గొన్నారు.

రూ.68.09 కోట్లతో బడ్జెట్ ఆమోదం

మున్సిపల్ ఆదాయం పెంచడంలో అధికారులు విఫలం
అభివృద్ధికి తెస్తామన్న రూ.700 కోట్ల సంగతేంటి...?
అధికారులు, ఛైర్మన్‌ను ప్రశ్నించిన వైసిపి కౌన్సిలర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి ఫ్లోర్ లీడర్ ఆసిఫ్‌వుల్లా

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘం 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌ను చిన్నపాటి సవరణతో రూ.68,09,03, 500లకు కౌన్సిల్ సభ్యులు అమోదం తెలిపారు. శుక్రవారం మున్సిపల్ చైర్మేన్ రమేష్ కుమార్ అధ్యక్షతన బడ్జెట్ పై ప్రత్యేక సమావేశం జరిగింది. రూ. 68 కోట్లతో హిందూపురం మున్సిపల్ బడ్జెట్ ను అధికారులు రూపొందించారు. మునిసిపాలిటీకి పన్నుల ద్వారా రూ.48.86 కోట్లు, కేంద్ర ప్రభుత్వ నిధులు ద్వారా రూ.10.75 కోట్లు వస్తాయని మొత్తంగా ఆదాయం రూ.59.61 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. మున్సిపాలిటీకి ఆదాయం ప్రధానంగా ఆస్తి పన్ను ద్వారా రూ.15 కోట్లు, ఖాళీ జాగాల పన్నులు రూ.2 కోట్లు, సబ్ రిజిస్ట్రర్ కార్యాలయం నుంచి రూ.8కోట్లు, మార్కెట్ లీజు, గదుల అద్దెలు తదితర వాటి నుంచి రూ.7కోట్లు, నీటి పన్నుల ద్వారా రూ.3కోట్లు టౌన్ ప్లానింగ్ నుంచి రూ.6.50కోట్లు, ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా రూ.50లక్షలు, ఇతర ఫీజులు, తదితర వాటి నుంచి రూ.5కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీ ఖర్చు చేసిన వాటికి ఇచ్చే రూ.1.8 కోట్లు మొత్తంగా మునిసిపల్ ఆదాయం 48.86 కోట్లు ఉంటుందని నిర్ధారించారు. దీనికి అదనంగా కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.10.75 కోట్లు నిధులు వస్తాయని అంచనా వేశారు. ఈ నిధులకు తోడుగా మరో రూ.8.5 కోట్లు లోటుతో ఖర్చు మొత్తం 68 కోట్లు ఉండవచ్చని అంచనా వేశారు. ఇందులో ప్రధానంగా పొరుగు సేవల ఉద్యోగుల వేతనాల కోసం రూ.12 కోట్లు, విద్యుత్ చార్జీల కోసం రూ.12 కోట్లు, నీటి పథకాల నిర్వహణకు రూ.3కోట్లు కేటాయించారు. పాలన పరంగా రూ.2కోట్లు విద్యుత్ చార్జీలు, నీటి సరఫరా నిర్వహణ, శానిటేషన్ కోసం మొత్తంగా రూ.25 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉంటుందని సాధారణ ఖర్చులు రూ.40.71 కోట్లు ఉంటాయని అంచనా వేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.10.7 కోట్లకు అదనంగా మున్సిపాలిటీ నిధుల నుంచి మూలధన వ్యయం కింద అభివృద్ధి పనులకు పెద్ద ఎత్తున కేటాయించినట్లు బడ్జెట్ లో పేర్కొన్నారు. అభివద్ధి కోసం మొత్తంగా 27.37 కోట్లు ఖర్చు చేయనున్నట్లు బడ్జెట్ లో పేర్కొన్నారు. అయితే ఈ బడ్జెట్‌పై కౌన్సిల్ ప్రతి పక్ష నేత ఆసిఫ్ వుల్లా, డిప్యూటీ కౌన్సిల్ ప్రతి పక్ష నేత నాగేంద్ర బాబు మాట్లాడుతు రూ.700 కోట్లతో తాము పట్టణాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పున్నారని ఆ రూ.700 కోట్ల సంగతేంటని ప్రశ్నించారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు మాట్లాడుతు రూ.92కోట్లు, రూ.120 కోట్లకు సంబందించి రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖలో ఫైల్ ఉందని, నిధులు మంజూరైతే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బడ్జెట్ ను సవరణ చేయడం జరుగుతుందని అన్నారు. మిగిలిన వాటికి సంబందించి డిపిఆర్ సిద్ధం చేసి ప్రభుత్వనికి పంపామని చెప్పారు. వాటిని బడ్జెట్ లో చూపించడానికి ఉండదన్నారు. రెండు సంవత్సరాలుగా సబ్ రిజిస్టర్ కార్యలయం నుంచి నిధులు రాలేదని, సుమారు రూ.4కోట్ల వరకు బకాయి ఉందని అన్నారు. నిధులను విడుదల చేయాలని పలు మార్లు ఆ శాఖకు కోరామని చెప్పారు, బడ్జెట్‌లో సెల్ టవర్ల నుంచి ఆదాయం లేదని చూపించడంపై డిప్యూటి కౌన్సిల్ ప్రతి పక్ష నేత నాగేంద్ర బాబు పట్టణంలో దాదాపు 300 నుంచి 400 వరకు సెల్ టవర్లు ఉన్నాయని, పన్నులు ఎందుకు వసూలు చేయడం లేదని ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ మూడు రోజుల్లో సెల్ టవర్ నిర్వాహకులకు నోటీసులు ఇచ్చి పన్నులు వసూలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రూ.23కోట్లతో నూతనంగా మార్కెట్ నిర్మాణం చేయడం జరిగిందని దీంతో పాటు మరో రూ.4కోట్ల వరకు ఖర్చు చేసి మార్కెట్ ను వినియోగంలోకి తీసుకోచ్చారు. అయితే దాని ఆదాయం మాత్రం ఆశించిన స్థాయిలో రావడం లేదని సభ్యులు వ్యాఖ్యానించారు. దీనిపై ప్రత్యేక కమిటీ వేసి ఆదాయం పెంచడానికి అవసరమైన చర్యలను తీసుకోవాలని, అదే విధంగా ఇప్పటకే చాలా మంది గదులను అద్దెకు తీసుకుని, వ్యాపారాలు జరగడం లేదని వారు తీసుకున్నా గదుల్లోకి వెళ్లలేదని అన్నారు. వీటిపై చర్చించి, పూర్తి స్థాయిలో మార్కెట్ ను వినియోగంలోకి తీసుకోచ్చే విధంగా చూడాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతు బెంగళూరు రోడ్డు వెడల్పు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ ప్రాంతంలో ఉన్నా బ్యాంకు నిర్వహకులతో ఇప్పటికే చర్చించామని షాపింగ్ కాంప్లెక్స్‌లో గదులు ఉన్నాయని, బ్యాంక్ నిర్వహణకు తగిన విధంగా చేసి ఇస్తామని వారికి సూచించామన్నారు. బ్యాంకులు అక్కడికి వస్తే వ్యాపారాలు బాగా జరుగుతాయని అద్దెకు తీసుకున్నా వారందరు అక్కడికి వచ్చి వ్యాపారాలను చేస్తారని దీని కోసం అవసరమైన చర్యలను తీసుకుంటున్నామని చెప్పారు. ఇక అద్దెలను తగ్గించే విషయంలో ప్రత్యేక కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి కౌన్సిల్ సభ్యుల అమోదం మేరకు సిడిఎంఎకు పంపుతామన్నారు. పైప్ లైన్ ద్వార గ్యాస్ సరఫరా చేస్తామని నిర్వహకులు ఎక్కడ పడితే అక్కడ గుంతలు పెట్టారని వారిపై ఏలాంటి చర్యలు తీసుకున్నారని అసిఫ్ వుల్లా ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతు ఇప్పటికే వారి నుంచి రూ.1.37 కోట్లు డిడి రూపంలో తీసుకున్నామని ఇంకా చెల్లించాలని నోటీసులు ఇచ్చామని సమాధానమిచ్చారు. ఖాళీ జాగ పన్నుల విషయంలో సబ్ రిజిస్టర్ కార్యలయంలో మున్సిపల్ సిబ్బందిని నియమించి, రోజు ఎన్ని రిజిస్టర్ లు జరుగుతున్నాయి, వాటి వివరాలను సేకరించి, వాటికి పన్నులు విధిస్తే ఆదాయం పెరుగుతుందని, దీంతో పాటు ఆస్తి పన్ను చెల్లించని తపాలా కార్యాలయం, రైల్వే స్టేషన్ తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో చర్చించి పన్నులు వసూలు జరిగే విధంగా చూడాలని ఆసిఫ్ వుల్లా కోరారు. గతంలో టౌన్ ప్లానింగ్ వారు అనుమతులు లేని కట్టడాలను గుర్తించి నోటీసులు ఇవ్వడంతో పాటు చార్జీషీట్ వేశారని, ఆ విషయంపై ఏలాంటి చర్యలు తీసుకున్నారని ఆసిఫ్‌వుల్లా అడిగారు.చివరకు జమలు, చెల్లింపులపై పలు సూచనలతో, చిన్న పాటి సవరణలతో బడ్జెట్ అమోదం తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మేన్ జబివుల్లా, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ మెంబర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సింగల్ టెండర్ ఆమోదంపై వైసీపీ అభ్యంతరం

మున్సిపాలిటీలోని కరువు నిధుల వినియోగం విషయంలో చేపట్టే పనులకు సింగిల్ టెండర్ ఆమోదానికి అజెండా పెట్టడంపై వైసిపి కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. శుక్రవారం ఉదయం మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు 30 అంశాలతో కూడిన అజెండాతో పాటు 9 అంశాలతో ప్రత్యేక అజెండా, ఒక అంశంతో టేబుల్ అజెండాను సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. పురపాలక సంఘంలో ఉన్న కరువు నిధులను కరిగించడానికి అంచనాలకు మించి అధికారులు అంచనాలు వేయడంతో పాటు ఒకే వ్యక్తి సిద్ధం చేసిన అంచనాలకు మించి 4.5 శాతం ఎక్కువ వేసిన టెండర్ ను ఎలా ఆమోదించాలని, అజెండాలో ముందు తెలిసిన ఈ పది అంశాలపై తాము అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామన్లి వైసిపి ఫ్లోర్ లీడర్ అసిఫ్ వుల్లా పేర్కొంటూ, పార్టీ తరపున డీసెంట్ నోటీసును మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ కు అందించారు. ఈసందర్భంగా ఫ్లోర్ లీడర్ ఆసిఫ్ వుల్లా తో పాటు కౌన్సిలర్ శివ మాట్లాడుతూ, పురపాలక సంఘంలో దాదాపు రూ, 2 కోట్లకు పైగా కరువు నిధులు ఉన్నాయని ఈ నిధులపై కన్నేసిన అధికార పార్టీ నాయకులు నీటి సమస్య తెరపైకి తీసుకుని వచ్చి ఆ నిధులను కరిగించడానికి వివిధ పనుల నిమిత్తం అంచనాలను సిద్ధం చేసి, ఈ పనులను ఒకే గుత్తేదారుడికి, అది కూడా అంచనాల కన్నా 4.5 శాతం అధికంగా వేసిన టెండర్ వేశారని విమర్శించారు. దీనినిఎలా ఆమోదించాలని ప్రశ్నించారు. కరువు నిధులను వాటాలు వేసుకొని పంచుకోవడానికి కోసమా ఈ పనులను ఒకే గుత్తే దారుడికి కట్టబెట్టాలని ప్రయత్నం చేస్తున్నారని వారు ఆరోపించారు. దీంతో అధికార ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. వాటాలు ఎవరికి ఎవరు ఇచ్చారో చెప్పాలని టిడిపి కౌన్సిలర్లు పట్టు పట్టారు. 7వ వార్డు కౌన్సిలర్ నాసిర బాను వైసిపి నుంచి గెలిచినప్పటికీ బాలకృష్ణ సమక్షంలో టిడిపి కండువా వేసుకోవడం వల్లే తన వార్డులో ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్నా మురుగు కాలువ నిర్మాణ పనులు పూర్తి అయ్యాయని పోడియం ముందు వచ్చి చెబుతూ బాలకృష్ణకు కతజ్ఞతలు తెలిపింది. ఈ విషయంపై వైస్ చైర్మన్ జబివుల్లా అభ్యంతరం వ్యక్తం చేశారు. 7వ వార్డులో ఉన్న మురికి కాలువ నిర్మాణం కోసం వైసిపి అధికారంలో ఉన్న సమయంలోనే నిధులు కేటాయించడంతో పాటు పనులు సైతం ప్రారంభించడం జరిగిందన్నారు. ఇప్పుడు పూర్తి అయితే దానికి పార్టీ మారితేనే అభివృద్ధి జరిగిందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. ఈ విషయంలో వీరిద్దరి మధ్య కొద్దిసేపు తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. వైస్ చైర్మన్ జబీవుల్లా తనకు క్షమాపణ చెప్పాలని కౌన్సిలర్ నాసిరాబాను డిమాండ్ చేసింది. ఒక పార్టీ గుర్తుతో గెలిచి డబ్బుకు అమ్ముడు పోయిన కౌన్సిలర్‌కు ఎందుకు క్షమాపణ చెప్పాలంటూ వైస్ చైర్మన్ వాదనకు దిగారు. ఈ విషయంలో సభలో కొద్దిసేపు గందరగోళ వాతావరణం నెలకొంది. చివరకు చైర్మన్ రమేష్ కుమార్ కలుగజేసుకొని సభను సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు. అజెండాలోని ఇతర అంశాలపై చర్చించి మిగిలిన అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

ఆరోగ్య ఉప కేంద్ర భవనాలకు మరమ్మతులు

ప్రజాశక్తి - పరిగి

మండల కేంద్రంలోని శ్రీరంగరాజుపల్లి రహదారి ప్రాంగణంలో నిరుపయోగంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాలను మరమ్మతులు చేపట్టాలని ఎంపిడిఒ శ్రీధర్ సూచించారు.గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే సిబ్బందికి నివాసాల కోసం ఏర్పాటు చేసిన ఈ భవనాలు గత 30 ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో అవి ఆక్రమణలకు గురి కావడమే కాకుండా శిథిలావస్థకు చేరడంతో శుక్రవారం ఎంపీడీవో, టిడిపి మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి, డాక్టర్ స్వరూప రెడ్డి వాటిని పరిశీలించారు. మండల పరిషత్ గ్రాంట్ ద్వారా మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. అనంతరం మిత్ర వాటర్ ప్లాంట్‌ను పరిశీలించి వేసవికాలంలో ప్రతి గ్రామానికి నీరు అందేలా మిత్ర ఏజెన్సీ నిర్వాహకులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, సర్పంచి ప్రభాకర్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

టమోటా పంట రైతులకు ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పించి ఆదుకుంటుందని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. ప్రస్తుతం టమోటాకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర నష్టాల్లో ఉన్నారని అలాంటి రైతాంగాన్ని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయ శాఖ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రైతుల నుంచి కిలో 8 రూపాయలతో సేకరించి రాష్ట్రంలోని రైతు బజార్లకు సరఫరా చేసే విధంగా నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఈ విషయంపై అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇది రైతు సంక్షేమ ప్రభుత్వమని ,రైతులు ఎవరు అధైర్యపడవద్దని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. టమోటా రైతులను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబుకు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెనాయుడుకు రైతుల తరపున పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కదిరిలో బీడీ వర్కర్స్ యూనియన్ సమావేశం

ప్రజాశక్తి - కదిరి టౌన్

సిఐటియు అనుబంధ ఆంధ్రప్రదేశ్ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశం శనివారం కదిరిలో నిర్వహిస్తున్నట్లు సిఐటియు నాయకులు తెలిపారు. ఈ సమావేశానికి బీడీ వర్కర్స్ యూనియన్ సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఓబులు, కో కన్వీనర్ ఇక్బాల్ హుస్సేన్‌తో పాటు వివిధ జిల్లాల నుంచి నాయకులు హాజరవుతారని సిఐటియు పట్టణ కన్వీనర్ జగన్మోహన్, కో కన్వీనర్లు ముస్తాక్ అలీ, రామ్మోహన్ తెలిపారు. ఈ సమావేశంలో బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించి కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావడానికి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

పరీక్ష కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మార్చి ఒకటో తేదీన నిర్వహించనున్న ఇంటర్ పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాలను స్థానిక తహశీల్దార్ నారాయణస్వామి శుక్రవారం పరిశీలించారు.పరీక్షా కేంద్రాల్లో ఉన్న సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కళాశాలలో సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బైక్ బోల్తా.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రొద్దం

ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో ఒకరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని బూధిపల్లి గ్రామానికి చెందిన ఉప్పర రమేష్(45) బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళుండగా పరిగి మండలంలోని బీచిగానిపల్లి, గొల్లపల్లి గ్రామాల మధ్య అదుపుతప్పి రోడ్డు పక్కనే రోడ్డు కోసం తీసిన కాలువలో పడి మృతి చెందాడు. ఉదయం ఆ రోడ్డు వెంబడి వెళ్లే వారు గమనించి సమాచారం ఇవ్వడంతో పరిగి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడ లభించిన ఆధారాల మేరకు మృతుడిని రొద్దం మండలంలోని బూధిపల్లి గ్రామానికి చెందిన ఉప్పర రమేష్‌గా గుర్తించి సమాచారం ఇవ్వడంతో ఆయన కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. అనంతరం పోలీసులు మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదం.. ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి ముదిగుబ్బ

మండల కేంద్రంలోని బైపాస్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని సిద్దన్నగారి పల్లికి చెందిన గోపాల్, ఆయన సోదరి అరుణమ్మ, మరో బాలిక ముగ్గురు ద్విచక్రవాహనంపై ముదిగుబ్బ వస్తుండగా ప్రమాదం జరిగింది. వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 పోలీస్, సిబ్బంది ,బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

మద్యం దుకాణం సీజ్

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల కేంద్రంలోని మద్యం దుకాణాన్ని ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు విచారించిన అధికారులు అది నిజమని తేలడంతో సీజ్ చేసినట్లు సమాచారం. అయితే ఈ విశయంపై వివరణ కోసం ఎక్సైజ్ జిల్లా అధికారి గోవింద్ నాయక్‌ను సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

వైసిపి పాలన దోపిడీమయం : ఎమ్మెల్యే



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి -కదిరి అర్బన్

గత వైసిపి పాలన మొత్తం దోపిడీమయం అని రెవెన్యూ పోలీసుల అధికారులను అడ్డుపెట్టుకొని పేద ప్రజలకు రావాల్సిన అన్నిటిని నాయకులు అక్రమంగా సంపాదించడమే ధ్యేయంగా పనిచేశారని విషయాన్ని కదిరి నియోజకవర్గ ప్రజలు తెలుసుకోవాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానిక రోడ్లు భవనాల అతిథిగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులపై జగన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమన్నారు. తమ ప్రభుత్వం వస్తే గుడ్డలు ఊడదీస్తామని చెప్పుకుంటున్న నాయకులను ప్రజలు ప్రస్తుతం గుడ్డలు ఊడదీసి నిలుబెట్టారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ పాలనలో గంజాయి అసాంఘిక కార్యక్రమాలు పెరిగిపోయి భూకబ్జాల వృత్తిగా భావించి అమాయకుల ప్రజలను మోసం చేశారన్నారు. అక్రమ లేఅవుట్లు వేసి పార్కు స్థలాలను కూడా అమ్మేసిన వైనం కదిరి ప్రాంతంలో జరగడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే స్థాయి అని చెప్పుకుంటున్న నాయకులు దళారులను అడ్డుపెట్టుకొని పేద ప్రజలకు అందాల్సిన పట్టాలను వారికి అప్పజెప్పి అక్రమ సంపాదన చేసుకున్న విషయం ప్రజలకు తెలుసన్నారు. పేద ప్రజలను భయపెట్టి నాయకులమని చెప్పుకుంటూ ప్రభుత్వ స్థలాలను దండుకుంటే చూస్తూ ఊరుకోమన్నారు. అన్యాయంగా కేసులు పెడుతున్నారని ఉపన్యాసాలు ఇస్తున్న నాయకులు అన్యాయం జరిగి ఉంటే నోరు విప్పి మాట్లాడి ప్రజల ముందుకు రావాలని సవాల్ విసిరారు. తప్పు చేస్తే దండించడానికి చర్యలు తీసుకోవడానికి చట్టాలు ఉన్నాయన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వసతులు

కదిరి టౌన్ :కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్పష్టం చేశారు. కదిరి రోడ్లు భవనాలు అతిథి గహంలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ అధ్యక్షతన కదిరి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు .ఈ సమావేశంలో ఏరియా హాస్పిటల్‌లో నెలకొన్న ప్రధాన సమస్యలను హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.ఈ సందర్భంగా కందికుంట మాట్లాడుతూ గత ప్రభుత్వం హయంలో నిర్మాణ పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు మెరుగైన వైద్యసేవలకు పెద్ద పీట వేస్తుందని అందులో భాగంగా ఆసుపత్రి భవన నిర్మాణ పనులు పున్హ ప్రారంభిస్తామని చెప్పారు. 10 మండలాల నుంచి వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అందించడం కోసం కృషి చేస్తామని చెప్పారు. అలాగే సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని హాస్పిటల్ ఆవరణంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్ కిరణ్ కుమార్, సీనియర్ వైద్యులు డాక్టర్ శంకరయ్య , హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు రెడ్డి, బాషా, కేవవ రెడ్డి , లక్ష్మణ కుటాల, వేణుగోపాల్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇమామ్, మౌజన్ల వేతనాల విడుదలపై హర్షం

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

ఇమామ్, మౌజన్లకు అందాల్సిన ఆరు నెలల గౌరవేతనం 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వం రూ. 45 కోట్లు విడుదల చేయడానికి చర్యలు తీసుకోవడం పట్ల టిడిపి మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రంజన్ పండుగ సందర్భంగా ఇమామ్, మౌజాలకు ప్రభుత్వం శుభవార్త తెలిపిందన్నారు. నిధులు విడుదల చేయాలని మైనార్టీ వెల్ఫేర్ కమిషనర్‌కు ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందన్నారు. ఇమామ్లకు నెలకు 10 వేలు, మౌజన్ల కు 5 వేలు అందించనున్నారన్నారు. ముస్లిం మైనార్టీ అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, తన వంతు కృషి చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

యూనివర్సిటీ కరాటే ఛాంపియన్‌షిప్‌లో కదిరి విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - కదిరి టౌన్



ప్రోత్సాహక బహుమతి చెక్కుతో విద్యార్థిని

విజయవాడలోని విఐటిఎఫ్ యూనివర్సిటీ లో నిర్వహించిన యూనివర్సిటీ గేమ్స్‌లో కదిరి విద్యార్థి కరాటే మాస్టర్ షేక్షావలి స్టూడెంట్ నేహా అంజుమ్ ప్రతిభ కనపర్చింది. కట, కుమ్మితే విభాగాల్లో పాల్గొన ఈమె కటా విభాగంలో బంగారు పతకం, 5 వేల రూపాయలు నగదు పారితోషికం పొందింది. అదేవిధంగా కుమ్మితే -60కేజీ విభాగంలో బంగారు పతకం, 5 వేల రూపాయలు సాధించింది. ప్రతిభా విద్యార్థినియూనివర్సిటీ యాజమాన్యం, విద్యార్థులు అభినందించారు.

మంచి చేయడం అలవాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - బత్తలపల్లి

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారుడు కి మంచి చేయడం ప్రతి పోలీసు అలవాటు చేసుకోవాలని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ రత్న సూచించినట్లు ఎస్ఐ తెలిపారు. శుక్రవారం పుట్టపర్తి లో జరిగిన డిస్టిక్ క్రైమ్ రివ్యూ మీటింగ్ లో శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ చేతుల మీదుగా బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్, ఎఎస్ఐ విజయ్ కుమార్, కానిస్టేబుల్ గోపాల్ ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గత నెల 31 రాత్రి సుమారు 11 గంటల సమయంలో సూర్యచంద్రపురం గ్రామానికి చెందిన సాకే కుళ్లాయప్ప స్టేషన్‌కు వచ్చితన భార్య, ముగ్గురు పిల్లలను పిలుచుకొని ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందని ఎక్కడికి వెళ్లిందో తెలియదని మిస్సింగ్ కేసు కింద ఫిర్యాదు చేశాడన్నారు. ఫిర్యాదు తీసుకున్న వెంటనే అందుబాటులో రాత్రి విధులలో ఉన్న ఎఎస్ఐ విజయ్ కుమార్, కానిస్టేబుల్ గోపాల్ వెంటనే కనపడకుండా పోయిన వారి లొకేషన్ ఆధారంగా వారున్నచోటికి వెళ్లి తెల్లవారిసరికి ఫిర్యాదుదారుడి భార్య పిల్లలని వెతికి పట్టుకొని పోలీస్ స్టేషన్ తీసుకొని వచ్చి తహశీల్దార్ సమక్షంలో వారికి ఫిర్యాదుదారుడికి అప్పగించడం జరిగిందన్నారు. ఇందుకుగాను తమకు గుడ్ వర్క్ ఫర్ డన్ క్రింద ప్రశంసా పత్రం అందజేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరోపణలు అవాస్తవం : మాజీ మంత్రి పల్లె

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

తాను వివాదరహితుడిని, తనకు ఎవరితోనూ శత్రుత్వం లేదని తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం స్థానిక మీడియాతో మాట్లాడారు. కళాశాల భూములను అమ్మి రియల్ ఎస్టేట్ చేయాల్సిన అవసరం తనకు లేదని గత 30 ఏళ్లుగా టిడిపి కోసం క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా చేశానని చెప్పారు. కదిరి నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి గెలుపు కోసం పనిచేయలేదని తనపై ఆరోపణలు వచ్చాయని దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తల కోసం స్పందించాల్సిన అవసరం ఉందని అన్నారు. తన 30 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఎన్నడూ కూడా పార్టీకి కానీ, పార్టీ అధిష్టానం నిలబెట్టిన అభ్యర్థులకు వ్యతిరేకంగా చేయలేదని భవిష్యత్తులో అలాంటి ఆలోచన కూడా తనకు రాదని అన్నారు. ముఖ్యంగా కదిరి, ముదిగుబ్బలో కళాశాల ఆస్తులను అమ్మి రియల్ ఎస్టేట్ చేస్తున్నారనే ఆరోపణలు తనపై వచ్చాయని అన్నారు. కదిరి, ముదిగుబ్బలో ఉన్న కళాశాలకు సొంత భవనాలు లేవని ఆరోపణలు చేశారని 30 ఏళ్లుగా కదిరి, ముదిగుబ్బలో కళాశాలలు తన సొంత భూమిలో నడుస్తున్నాయని అన్నారు.పార్టీలో ఎలాంటి వర్గాలు విభేదాలు లేవన్నారు. నియోజకవర్గ ప్రజల కోసం టిడిపి కార్యకర్తల కోసం ప్రాణం ఉన్నంతవరకు పార్టీ కుటుంబ సభ్యుడిగా పనిచేస్తానని పేర్కొన్నారు.